
సాక్షి
తిరుపతి

శుక్రవారం । 14 । ఏప్రిల్ । 2023



సాగుకు పెట్టుబడి సాయం

వ్యవసాయ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వం సాగుకు పెట్టుబడి సాయం చేయనుంది. పంటల వారీగా రుణాల పంపిణీకి ప్రణాళిక సిద్ధం చేశారు. - 8లో



15న టీటీడీ పాలకమండలి సమావేశం

తిరుమల: టీటీడీ పాలకమండలి సమావేశం శనివారం జరగనుంది. టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి నేతృత్వంలో తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో సమావేశం జరగనుంది.

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	40	23
చిత్తూరు	40	23
తిరుమల	36	20
గూడూరు	42	26
నగరి	41	24

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్రవారం(సా)	సహర్ శనివారం(ఉ)
తిరుపతి	6.29	4.39
చిత్తూరు	6.31	4.39
పుంగనూరు	6.32	4.42

న్యూస్‌రీల్

అంబేడ్కర్ జీవితం ఆదర్శం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీ గురుమూర్తి, వీసీ రాజారెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జీవితం నేటి యువతకు స్ఫూర్తి అని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి తెలిపారు. తిరుపతి ఎస్వీయూ సెనేట్ హాలులో 132వ అంబేడ్కర్ జయంతి పురస్కరించుకుని గురువారం 'భారత రాజ్యాంగం' అనే అంశంపై వీసీ ప్రొఫెసర్ కె.రాజారెడ్డి అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నేటి యువత అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఎన్ని ఒడిదుడుకులు, కష్టాలు ఎదురైనా ఆత్మవిశ్వాసంతో లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం మన దేశ ఉజ్వల భవితకు కరదీపిక వంటిదన్నారు. ఆయన కృషి ఫలితంగా లభించిన రాజ్యాంగ ఫలాలను అందరం ఆస్వాదిస్తున్నామని, అలాంటి రాజ్యాంగంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని తెలిపారు.

నేడు అంబేడ్కర్ జయంతి

తిరుపతి అర్బన్: తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం 132వ జయింతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందని తెలిపారు. ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, అధికారులు, ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జిల్లా పోలీసుశాఖకు ఉగాది పురస్కారాలు



బాబు ప్రసాద్, దిశ డీఎస్పీ, చిత్తూరు

చిత్తూరు అర్బన్: ఉమ్మడి జిల్లా పోలీసు, విజిలెన్స్, అగ్నిమాపక శాఖల్లో పని చేస్తున్న పలువురికి ఉగాది పురస్కారాలు వరించాయి. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో మహోన్నత సేవా పతకం కింద చిత్తూరు దిశా డీఎస్పీ బాబు ప్రసాద్ ఎంపికయ్యారు. అలాగే ఉత్తమ సేవా పతకానికి తిరుపతి సూళ్లూరుపేట సీఐ వెంకటేశ్వరరెడ్డిని ఎంపిక చేశారు. సేవా పతకానికి చిత్తూరు జిల్లాలో శ్రీనివాసులు నాయుడు (చౌడేపల్లి సీఐ), నాగేంద్ర (కాణిపాకం హెడ్ కానిస్టేబుల్), భాస్కరయ్య (ఎస్ఆర్‌పురం హెడ్ కానిస్టేబుల్), తిరుపతి జిల్లాలో రామకృష్ణ (తిరుపతి సీఐడీ), ఆనంద్ (వెస్ట్ ఏఎస్ఐ), రవి (తిరుపతి ఆర్ఎస్ఐ), రామయ్య (బాలయ్యపల్లి హెడ్ కానిస్టేబుల్), హాలియమ్మ (తిరుచానూరు డబ్ల్యూ ఏఎస్ఐ), గోపాలకృష్ణ (తిరుపతి దిశ కానిస్టేబుల్), లావణ్య ప్రసాద్ (తిరుపతి విజిలెన్స్), రామ స్వామి (పీలేరు ఫైర్‌మెన్), డేవిడ్‌సన్ (గూడూరు ఫైర్ మెన్), చంద్రశేఖర్ (గూడురు డ్రైవర్ ఆఫరేటర్) గిరిధర్ (తిరుపతి గార్డ్)ను ఎంపిక చేసినట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

సర్వే రాళ్ల ఏర్పాట్లు వేగవంతం



మాట్లాడుతున్న జేసీ బాలాజీ

తిరుపతి అర్బన్: భూ రీసర్వే పూర్తయిన ప్రాంతాల్లో సరిహద్దు రాళ్ల ఏర్పాటును వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి డీఆర్వో ఎం.శ్రీనివాసరావు, సర్వే ఏడీ జయరాజ్‌తో కలసి వీడియా కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. ప్రధానంగా మొదటి దశ సర్వేకు సంబంధించి పెండింగ్ లేకుండా చూడాలని ఆదేశించారు. ఇప్పటి వరకు 39,322 సర్వే రాళ్లు నాటే లక్ష్యంలో భాగంగా 21,396 మాత్రమే నాటారని వివరించారు. మిగిలిన వాటిని గడువులోపు పూర్తిచేయాలని చెప్పారు. ఎక్కువ మందితో టీమ్ వర్క్‌గా పని చేస్తే ప్రక్రియ త్వరితగతిన పూర్తి అవుతుందని స్పష్టం చేశారు.



రేణిగుంట సమీపంలో ఓ రైస్ మిల్లులో బియ్యం వ్యాపారి రేషన్, నాసిరకమైన బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నాడు. రోజూ రెండు, మూడు లారీల బియ్యం దిగుమతి చేసుకుంటున్నాడు. దాన్ని పాలిష్ చేసి సన్న బియ్యంగా మార్చి 12 రకాల బ్రాండ్ల పేరుతో తిరుపతి, చిత్తూరు జిల్లా వ్యాప్తంగా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడు. లాభాల్లో అధికారులు కొంత.. వ్యాపారులు కొంత పంచుకుంటున్నారు. నకిలీ బియ్యం విక్రయాలపై 'సాక్షి'లో ప్రచురితమైన వరుస కథనాలపై వ్యాపారులు అప్రమత్తమయ్యారు. సరుకును దాచేసి.. దాడులు చేయకుండా అధికారులను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమైనట్లు సమాచారం.

నీకింత.. నాకింత

- నకిలీ బియ్యం వ్యాపారులు.. అధికారుల కుమ్మక్కు
- 'సాక్షి' కథనాలతో అప్రమత్తమైన అక్రమార్కులు
- నకిలీ బ్రాండ్ సరుకును దాచేసిన వైనం
- ఒకే మిల్లులో 12 రకాల నకిలీ బ్రాండ్ సంచులు
- బ్రాండింగ్ రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో క్వాలిటీ వ్యాపారుల సైలెంట్

సాక్షి, తిరుపతి : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నకిలీ బియ్యం వ్యాపారులు అప్రమత్తం అయ్యారు. నకిలీ బ్రాండ్ల సంచులు, నాసిరకం బియ్యాన్ని రహస్య ప్రాంతాల్లో దాచేశారు. ఏమీ తెలియనట్టు సంబంధిత అధికారులకు ఫోన్ చేసి 'సాక్షి' కథనాలపై ఆరా తీస్తున్నారు. దాడులు చేయకుండా మామూళ్లను పంపి అధికారులను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమైనట్లు సమాచారం. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నాసిరకం బియ్యాన్ని బ్రాండ్ల పేరుతో విక్రయిస్తున్న వ్యాపారులపై 'సాక్షి' వరుస కథనాలు ప్రచురిస్తున్న విషయం తెలిసిందే. తిరుపతి, చిత్తూరు నగరాలు కేంద్రంగా చేసుకుని నకిలీ వ్యాపారులు శ్రీకాళహస్తి, తిరుపతి, సత్యవేడు, చంద్రగిరి, గంగాధరనెల్లూరు, నగరి, పలమనేరు పరిసర ప్రాంతాల్లో ఉన్న రైస్ మిల్లుల్లో ఈ దందా కొనసాగిస్తున్నారు. నకిలీ వ్యాపారులు నిల్వ ఉన్న పాత బడి మగ్గిపోయి ఉన్న బియ్యాన్ని వెతికి మరీ కొనుగోలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అలా తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక లాభాలను ఆర్జిస్తున్నారు. గుట్టుచప్పుడు కాకుండా సాగిస్తున్న నకిలీ వ్యాపారంతా వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. మగ్గిపోయినవి, పక్వానికి రాని బి య్యాన్ని కొనుగోలు చేసి ఆహారంగా తీసుకుంటుండడంతో అనారోగ్యాల పాలవుతున్నారు. అయినా నాణ్యమైన బియ్యం విక్రయించే వారు ఫిర్యాదు చేయాల్సి ఉన్నా.. స్వలాభాపేక్షతో పట్టించుకోవడం లేదు. ఇంత దారుణం జరుగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తన్నట్టు వ్యవహరిస్తున్నారు. తనిఖీలు ఎందు చేయడం లేదని సంబంధిత అధికారులను అడిగితే 'మాకు ఫిర్యాదులు అందలేదు' అని చెప్పి తప్పించుకుంటున్నారు. అధికారులు స్పందించి నకిలీలపై కొరడా ఝులిపించి.. ఇటు ప్రభుత్వానికి, అటు ప్రజలకు మేలు చేయాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

లొసుగులే అక్రమార్కులకు వరం

జిల్లాలో నకిలీ బియ్యం విక్రయాలు యథేచ్ఛగా జరుగుతున్నా క్వాలిటీ బియ్యం విక్రయించే వారు ఫిర్యాదు చేయాల్సి ఉన్నా.. స్వలాభాపేక్షతో పట్టించుకోవడం లేదు. క్వాలిటీ బియ్యం అమ్మే వ్యాపారి బ్రాండ్‌కు రిజిస్ట్రేషన్ ఉండడం లేదు. ఆ బ్రాండ్‌ని రిజిస్ట్రేషన్ చేసుకుంటే ప్రభుత్వానికి 5 శాతం ట్యాక్స్ కట్టాలి. ఈ ట్యాక్స్ కట్టడం ఇష్టం లేక ఆ వ్యాపారి 26 కిలోల బియ్యం బస్తాలతో విక్రయాలు సాగిస్తున్నాడు. ఇదే బ్రాండ్ పేరుతో నకిలీలతో విక్రయాలు సాగుతున్నా నాణ్యమైన బియ్యం విక్రయించే బ్రాండ్ వ్యాపారి అధికారులకు ఫిర్యాదు చేసేందుకు సాహసించలేకపోతున్నాడు. ఈ లొసుగులను అవకాశం మలచుకుని నకిలీ బియ్యం వ్యాపారులు ఇష్టారాజ్యంగా క్రయ విక్రయాలు సాగిస్తున్నారు.

> **చర్యలు తీసుకుంటాం**
>
> నకిలీ బియ్యం వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం. విజిలెన్స్, తూనికలు కొలతలశాఖ సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తాం. నకిలీ వ్యాపారుల వివరాలు సేకరిస్తున్నాం. నిబంధనలకు విరుద్ధంగా క్రయ విక్రయాలు జరుగుతుంటే చర్యలు తప్పవు. ఎవరి దగ్గరైనా ఆధారాలు ఉంటే స్వచ్ఛందంగా ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదుదారుల పేర్లు గోప్యంగా ఉంచుతాం.
>
> – ఈశ్వర్‌రెడ్డి, విజిలెన్స్ ఎస్పీ

తిరుపతి జాతరకు 900 ఏళ్ల చరిత్ర



చిత్తూరు కలెక్టరేట్ : 900 సంవత్సరాల చరిత్ర కలిగిన తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల్లో తిరుపతి జాతర విశిష్టతను పేర్కొన్నారు. తిరుపతి తాతయ్యగుంట జాతరను ఘనంగా నిర్వహిస్తారు. ఆలయం సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబిస్తుంది. మేలో ఏడు రోజుల పాటు జాతరను రాష్ట్ర పండుగలా ప్రకటిస్తున్నట్లు ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇందుకు గాను ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి చేసిన కృషి ఫలించింది. రాష్ట్ర పండుగగా ప్రకటించినందుకు తిరుపతి వాసులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

24 నుంచి అందరికీ వైద్య పరీక్షలు



వివరాలు వెల్లడిస్తున్న ఎమ్మెల్యే, తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

- ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించాలి
- ప్రతి ఒక్కరికీ రూ.3వేలు విలువ చేసే వైద్య పరీక్షలు
- సచివాలయ పరిధిలో రోజూ 4వేల మందికి..
- కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష

తిరుపతి అర్బన్: చంద్రగిరి నియోజకవర్గంలో ఈనెల 24 నుంచి ప్రయోగాత్మకంగా 'అందరికీ వైద్య పరీక్షలు' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే, తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వెల్లడించారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీతో కలసి అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేకమంది వ్యాధి ముదిరిన తర్వాత ఆస్పత్రికి వస్తుండడంతో సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. అభివృద్ధి చెందిన పలు దేశాల్లో ప్రారంభ దశలో వైద్య పరీక్షలు చేయించుకుని సురక్షంగా జీవనం సాగిస్తున్నారని వివరించారు. ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తిస్తే ప్రమాదం ఉండద ని పేర్కొన్నారు. తుడా భాగస్వామ్యంతో చంద్రగిరి నియోజకవర్గంలో ఈనెల 24వ తేదీ నుంచి ప్రయోగాత్మకంగా అందరికీ వైద్య పరీక్షలు కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరికి రూ.3వేలు విలువ చేసే జనరల్ చెకప్ పరీక్షలు చేస్తామని తెలిపారు. సచివాలయ పరిధిలో రోజు 4వేల మందికి పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 90 రోజుల్లో నియోజకవర్గంలో అందరికీ వైద్య పరీక్షలు పూర్తి చేస్తామని వివరించారు. దేశంలోనే 'అందరికీ వైద్య పరీక్షలు' కార్యక్రమం మొదటి ప్రయోగంగా పేర్కొన్నారు. బ్లడ్ శాంపిల్స్ కోసం ఒక్కో చోట 30 కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మెడికల్ రిపోర్టులు యాప్‌లో అప్‌లోడ్ చేసి అందుబాటులో ఉంచుతామని చెప్పా రు. అవసరమైన మందులు, వ్యాధిని బట్టి ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తామని పేర్కొన్నారు.

రోగులకు టైమ్ స్లాట్

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య పరీక్షలకు టైమ్ స్లాట్ ఇస్తారన్నారు. అధికారులు మంచి కార్యక్రమంగా భాగస్వామ్యులు కావాలని తెలిపారు. సమావేశాలు నిర్వహించి ముందుగా సమాచారం ఇవ్వాలని చెప్పారు. ఎస్వీ మెడికల్ కళాశాల వైద్యులు, వైద్య విద్యార్థులు భాగ స్వామ్యులు కావాలని కోరారు. ఈనెల 21 కలెక్టరేట్‌లో ఉద్యోగస్తులకు మొదట జనరల్ చెకప్ చేస్తారని తెలిపారు. తుడ వీసీ హరికృష్ణ, జిల్లా అధికారులు, వైద్యశాఖల అధికారులు, చంద్రగిరి నియోజకవర్గ మండల అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయశాఖకు రెండోసారి అవార్డు

- రాష్ట్ర ఉత్తమ అధికారిగా ప్రసాద్‌రావు
- పలు స్కీమ్స్‌ల్లో 100 శాతం ప్రగతి
- టార్గెట్‌ను అధికమించిన వ్యవసాయశాఖ



జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయం

తిరుపతి అర్బన్: తిరుపతి జిల్లా వ్యవసాయశాఖ అధికారి(డీఏఓ) ఎస్.ప్రసాద్‌రావుకు మార్చినెలకు రాష్ట్రస్థాయి అవార్డు లభించింది. ఆయన ఉత్తమ అధికారిగా వరుసగా రెండోసారి ఎంపికయ్యారు. వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్ ఈమేరకు గురువారం ప్రకటించారు. వ్యవసాయశాఖలో ప్రతినెలా ఉత్తమ జిల్లా అధికారుల పేర్లను రైతు భరోసా పుస్తకంలో ప్రకటిస్తారు. రాష్ట్రంలోనే వ్యవసాయశాఖ విభాగంలో తిరుపతి జిల్లా సేవలు మొదటి స్థానంలో నిలిచాయి. మార్చి నెలకు సంబంధించి రాష్ట్ర ఉత్తమ అధికారిగా తిరుపతి జిల్లా డీఏవోకు అవకాశం దక్కింది. ఫిబ్రవరిలోనూ తిరుపతి డీఏవోకే రాష్ట్ర ఉత్తమ అవార్డు దక్కింది. ప్రధానంగా పంటల ఈ క్రాప్, స్పందన, జగనన్నకు చెబుదాం, ఆర్బీకేల ద్వారా సీడ్స్ పంపిణి, ఎరువుల పంపిణీ, రికార్డుల క్రమబద్ధీకరణ, బడ్జెట్ వ్యవహారాలు, పరికరాల పంపిణీ తదితర 22 అంశాల్లో 100 శాతం పూర్తి చేయడం ప్రశంసలు అందుకుంది. పీఎం కిసాన్ 99శాతం పూర్తి చేశారు. అలాగే జిల్లాలోని వరదయ్యపాళెం మండలం కాడూరు వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం వ్యవసాయశాఖ అసిస్టెంట్ ఏ.పవనరాజ్‌కు జిల్లా స్థాయి ఉత్తమ అవార్డు దక్కింది.

> **ఇదే స్ఫూర్తితో పనిచేస్తాం**
>
> 
>
> వరుసగా రెండు సార్లు రాష్ట్రస్థాయిలో తిరుపతికి జిల్లా వ్యవసాయశాఖను ప్రథమ స్థానంలో నిలిపాం. సమష్టి కృషితో ఇదే స్ఫూర్తితో ఏప్రిల్‌లోనూ మూడోసారి అవార్డు సాధిస్తాం. ఆ మేరకు కసరత్తు చేస్తున్నాం. ఉద్యోగులు బాధ్యతగా విధులు నిర్వహిస్తున్నారు.
>
> – ఎస్.ప్రసాద్‌రావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

ఈ కొలువు జగనన్న పుణ్యమే

- 1998 డీఎస్సీ అభ్యర్థుల నియామక ప్రక్రియ పూర్తి
- సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం
- 15 రోజుల్లోపు ఎంఈవో వద్ద రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశం



నియామకపత్రాన్ని అందజేస్తున్న డీఈఓ విజయేంద్రరావు



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఉద్యోగాలు పొందిన వారు

చిత్తూరు కలెక్టరేట్ : 'ఎట్టకేలకు జగన్ పుణ్యమా అని ఉద్యోగంలో చేరాం.'' అంటూ ఉద్యోగాలు పొందిన 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు ఆనందం వ్యక్తం చేశారు. చిత్తూరు డీఈవో కార్యాలయంలో గురువారం కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించారు. ఉదయం నుంచే పకడ్బందీగా సాగిన ఈ నియామక ప్రక్రియ సాయంత్రానికి ముగిసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఖాళీలను చూపించి కోరుకునే అవకాశం కల్పించారు. పలు ప్రాంతాల నుంచి కుటుంబ సభ్యులతో అభ్యర్థులు డీఈవో కార్యాలయానికి విచ్చేయడంతో సందడి నెలకొంది.

533 మందికి ఉద్యోగాలు

ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 533 మంది డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు ఉద్యోగాలిచ్చారు. పారదర్శకంగా కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించి, అభ్యర్థులు కోరుకున్న ప్రాంతాల్లోనే పోస్టింగులు ఇచ్చారు. డీఈవో విజయేంద్రరావు, చిత్తూరు డీవైఈవో చంద్రశేఖర్, ఏడీ వెంకటేశ్వరరావు సమక్షంలో అభ్యర్థులకు నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ నెల 12వ తేదీన 350 మందికి గాను 15 మంది గైర్హాజరవ్వగా 335 మందికి నియామకపత్రాలు అందజేశారు. ఈ నెల 13వ తేదీన 203 మందికి గాను 05 మంది గైర్హాజరవ్వగా 198 మందికి నియామకపత్రాలను అందజేసినట్లు డీఈవో వెల్లడించారు. నియామకపత్రాలు పొందిన అభ్యర్థులు 15 రోజుల్లోపు సంబంధిత ఎంఈవోల వద్ద జాయిన్ రిపోర్ట్ ఇవ్వాలని ఉత్తర్వుల్లో ఆదేశించారు.

> **సీఎం చిత్రపటానికి పాలాభిషేకం**
>
> చిత్తూరు డీఈవో కార్యాలయంలో నిర్వహించిన కౌన్సెలింగ్ కేంద్రం వద్ద ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. 1998 డీఎస్సీ అభ్యర్థుల అసోసియేషన్ సంఘం రాష్ట్ర నాయకులు సోమశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సర్కారు కొలువు ఆశను వదులుకున్న తమకు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి న్యాయం చేశారని హర్షం వ్యక్తం చేశారు. సంతోషంగా ఉద్యోగాల్లో చేరబోతున్నామని వెల్లడించారు. కార్యక్రమం పూర్తి అయిన తర్వాత మిఠాయిలు పంచిపెట్టారు.

రేపటి నుంచి చేపల వేటకు విరామం

- సంరక్షణ...పెంపుదలకు సహకారం
- పునరుత్పత్తి కాలం జూన్ 14 వరకు నిషేధం
- వైఎస్సార్ మత్స్యకార భరోసాతో విరామ సమయంలో రూ.10 వేలు సాయం



తూపిలిపాళెం సముద్రతీరం వద్ద ఆగి ఉన్న బోట్లు

తిరుపతి అర్బన్: చేపల పునరుత్పత్తి సమయంలో.. వాటి సంరక్షణకు ఏటా 61 రోజుల పాటు వేటను ప్రభుత్వం నిషేధిస్తుంది. ఈ క్రమంలో శనివారం నుంచి జూన్ 14వ తేదీ వరకు చేపల వేటకు విరామం ప్రకటించింది. ఈ కాలంలో మత్స్యకారులు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లకూడదని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో 75 కిలోమీటర్ల సముద్ర తీరం నెలకొని ఉంది. కోట, వాకాడు, చిల్లకూరు, సూళ్లూరుపేట ,తడ మండలాల్లో సముద్రం ఆధారంగా 10వేల మంది మత్స్యకారులు జీవనం సాగిస్తున్నారు. మత్స్యకార గ్రామాల్లో సచివాలయ ఫిషరీష్ అసిస్టెంట్లు, సాగరమిత్రలు నిషేధాన్ని అమలుకు నిరంతరం పర్యవేక్షణ చేయనున్నారు.

నిషేధం ఎందుకంటే...

చేపలు గుడ్లు పెట్టి పిల్లలుగా పొదిగి పూర్తి స్థాయి రూపాంతరం చెందేందుకు 61 రోజుల సమయం పడుతుంది. ఆ సమయం ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు ఉంటుంది. ఈ సమయంలో మోటార్ మెకనైజ్డ్ బోట్లతో వేట సాగిస్తే గుడ్లు పెట్టే చేపలతోపాటు పిల్ల చేపలు సైతం వలల్లో పడి మత్స్య సంపద పూర్తిగా నాశనం అయ్యే ప్రమాదం ఉంది. దీంతో మత్స్యకారులకు ఏడాది పాటు వేట సాగక ఇబ్బందులు పడే ప్రమాదం ఉంది. ఉపాధిలోని కోల్పోయే ప్రమాదం ఉంది. దీంతో ఏటా విరామం ప్రకటిస్తుంటారు.

రూ.10వేలు భృతి..

వేట విరామం సమయంలో మత్స్యకారులను ఆదుకోవాలనే ఉద్దేశంతో జగన్ సర్కార్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైఎస్సార్ మత్స్యకార భరోసా పేరుతో ఒక్కో కుటుంబానికి రూ.10 చొప్పున అందిస్తోంది. వేట సమయంలో డీజల్ బోట్లకు సబ్సిడీ సైతం ఇస్తోంది. నెలకు 100 లీటర్ల డీజల్‌కు..ఒక్కో లీటర్‌కు రూ.9 రాయితీ అందిస్తు ఆర్థికంగా ఆదుకుంటోంది.

జిల్లా సమాచారం

సముద్రం ఆధారిత మత్స్యకారులు	10వేల మంది
చెరువులు, వంకలు, డ్యామ్‌ల ఆధారిత మత్స్యకారులు	45 వేలమంది
చేపల వ్యాపారం ఆధారంగా	15 వేలమంది
మోటార్ బోట్లు	1050
సముద్రతీరం	75 కిలోమీటర్లు
ల్యాండ్ షిప్పింగ్ సెంటర్లు	25
మత్స్యకార సొసైటీలు	80

> **నిబంధనలు తప్పక పాటించాలి**
>
> 
>
> చేపల వేట విరామం సమయంలో ఎవ్వరూ సముద్రంలోకి వెళ్లకూడదు. నిబంధనలు తప్పకుండా పాటించాలి.అర్హులైన వారందరికీ వైఎస్సార్ మత్స్యకార భరోసా అందుతుంది. ప్రభుత్వ రాయితీలను పొందేందుకు సచివాలయంలోని మత్స్యశాఖ అసిస్టెంట్‌ను సంప్రదించవచ్చు.
>
> – చాంద్ బాషా, జిల్లా మత్స్యశాఖ అధికారి

> **మత్స్య సంపదకు సహకరించండి**
>
> 
>
> తిరుపతి జిల్లాకు కొత్తగా సముద్ర తీరం వచ్చింది. నిబంధనలు పాటించి మత్స్య సంపదకు మత్స్యకారులు సహకరించాలి. నిషేధం అమలుకు మత్స్యశాఖ, కోస్ట్ గార్డ్ , కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు, నేవీ, రెవెన్యూ అధికారులతో గస్తీ ఏర్పాటు చేస్తున్నాం.
>
> – కె.వెంకటరమణారెడ్డి, జిల్లా కలెక్టర్

- రాజ్యాంగ నిర్మాతకు సైకత నివాళి



రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ 132వ జయంతిని పురస్కరించుకుని సైకత శిల్పి మంచాల సనత్‌కుమార్ గురువారం సైకత నివాళి అర్పించారు. చిల్లకూరు మండలం తీగపాళెం సముద్ర తీరం వద్ద సైకత శిల్పంతోపాటు జైభీమ్ అనే నినాదాన్ని రూపొందించారు. – చిల్లకూరు

క్లుప్తంగా

సకాలంలో నియమావళి నివేదికలు


కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అంశాలను సకాలంలో నివేదికలు అందజేస్తామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి తెలిపారు. గురువారం వెలగపూడి నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటరు జాబితాలో మార్పులు చేర్పులు, ఎన్నికల నిర్వహణకు స్టాండర్డ్ ఆపరేటింగ్ సిస్టం ఏర్పాటుకు చర్యలు, పెండింగ్ ఎన్నికల అంశాలు, ప్రింటింగ్ ఆఫ్ పీవీసీ ఎపిక్ కార్డులు, వాటిని ఓటరుకు స్పీడ్ పోస్ట్ ద్వారా పంపడం తదితర అంశాలపై సమీక్షించారు. తిరుపతి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ కె వెంకటరమణారెడ్డి, జేసీ డికే బాలాజీ వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి 5 నాటికి జిల్లా ఓటర్ల తుది జాబితా మేరకు పురుషులు 8,47,343 మంది, మహిళలు 8,79,992 మంది, ట్రాన్స్ జెండర్లు 241 మంది ఉన్నారని చెప్పారు. 2,112 పోలింగ్ స్టేషన్లు గుర్తించామన్నారు. జిల్లాలో ఈపీ రేషియో, జెండర్ రేషియో అంశాలను వివరించి 18–19 ఏళ్ల యువతను గుర్తించి ఓటరు నమోదుకు తగు చర్యలు చేపడతామని తెలిపారు. బూత్ క్యాప్చరింగ్, రిసెప్షన్ ఏర్పాట్ల సబ్జెక్టులపై సకాలంలో నివేదిక పూర్తి స్థాయిలో అందజేస్తామని తెలిపారు. పీవీసీ ఎపిక్ కార్డులు ప్రింటింగ్ ఏజెన్సీ నుంచి అందాయని, ఓటర్లకు పంపుతామని వివరించారు.

సాగుకు పెట్టుబడి సాయం

వ్యవసాయ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి రుణాలు తీసుకుని రైతులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం పెట్టుబడి సాయం చేయనుంది. 2023–24 సంవత్సరానికి గాను పంటల వారీగా రుణ పరిమితి (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్) ఖరారు చేస్తూ రాష్ట్ర స్థాయి టెక్నికల్ కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో బ్యాంకుల ద్వారా రైతులు పంట రుణాలు పొందవచ్చు. జిల్లా వ్యాప్తంగా 2.98 లక్షల మంది రైతులను కిసాన్ క్రెడిట్ కార్డులకు అర్హులుగా గుర్తించారు. ఈ కార్డుల కింద గరిష్టంగా ఎలాంటి పూచీకత్తు లేకుండా రూ.1.60 లక్షల వరకు రుణం అందజేస్తారు.

- 2023–24లో స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఖరారు చేస్తూ ఉత్తర్వులు
- మే నుంచి ఖరీఫ్, అక్టోబర్ నుంచి రబీ రుణాల మంజూరు
- జిల్లాలో 2.98 లక్షల మంది రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు
- సకాలంలో రుణాలు చెల్లిస్తే పూర్తి స్థాయి వడ్డీ రాయితీ



తిరుపతి రూరల్: పంటల వారీగా రుణ పరిమితి ఖరారు చేస్తూ రాష్ట్ర స్థాయి టెక్నికల్ కమిటీ ఉత్తర్వులు జారీ చేయడంతో మే నుంచి సెప్టెంబర్ వరకు ఖరీఫ్‌గా, అక్టోబరు నుంచి మార్చి వరకు రబీ సీజన్‌గా పరిగణించి రుణ ప్రణాళిక అమలు చేయనున్నారు. ఏడాది కార్యాచరణ ప్రణాళికను లీడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో రూపొందించారు. ఏ పంటకు ఎంత రుణం ఇవ్వాలనే విషయమై నివేదిక రూపొందించారు. ఈ నివేదికను రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీకి పంపగా, అక్కడ అయా పంటలకు రుణ ప్రణాళికను విడుదల చేశారు. ఏడాదికేడాది పెట్టుబడి వ్యయం, కూలీల ఖర్చు పెరుగుతుండడంతో దాన్ని పరిగణలోకి తీసుకున్నారు. పంట రుణ పరిమితిని ఎకరాకు నిర్ణయించారు. ఇందుకు అనుగుణంగా బ్యాంకులు ఖరీఫ్, రబీ సీజన్లకు రుణాలు మంజూరు చేయనున్నాయి.

కిసాన్ క్రెడిట్ కార్డులు

అర్హులైన రైతులందరికీ కిసాన్ క్రెడిట్ కార్డులు మంజూరు చేయాలనే లక్ష్యంగా పనిచేస్తున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 2.98 లక్షల మంది రైతులను అర్హులుగా గుర్తించారు. ఈ కార్డుల కింద గరిష్టంగా ఎలాంటి పూచికత్తు లేకుండా రూ.1.60 లక్షల వరకు రుణం అందజేస్తారు. అందుకు కేవలం 7శాతం మాత్రమే వడ్డీ వసూలు చేస్తారు. ఏడాది లోగా రుణం తిరిగి చెల్లిస్తే వడ్డీలో 3శాతం రాయితీ బ్యాంకు అందజేస్తుంది. రూ.లక్ష లోపు రుణం ఏడాది లోగా చెల్లిస్తే రాష్ట్ర ప్రభుత్వం 4శాతం వడ్డీ రాయితీ ఇస్తుంది. దీంతో రూ.లక్ష వరకు రుణం తీసుకున్న రైతు సకాలంలో చెల్లిస్తే వడ్డీ భారం నుంచి పూర్తిస్థాయిలో మినహాయింపు పొందే అవకాశం ఉంది.

> “
> **అర్హులైన రైతులందరికీ రుణం**
>
> 
>
> జిల్లాలో అర్హులైన రైతులందరికీ పంట రుణం అందజేయడమే లక్ష్యంగా రుణ ప్రణాళిక తయారు చేశాం. కిసాన్ క్రెడిట్ కార్డులకు రైతులు దరఖాస్తు చేసుకోవాలి. జిల్లా వ్యాప్తంగా 2.98 లక్షల మంది రైతులను అర్హులుగా గుర్తించాం. రుణం ఏడాది లోగా చెల్లిస్తే వడ్డీ కట్టాల్సిన అవసరం ఉండదు. రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి రుణాలు తీసుకుని ఇబ్బందులు పడకుండా...బ్యాంకులో రుణాలు తీసుకుని వడ్డీ రాయితీ పొందాలి. ఈమేరకు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తాం. – సుభాష్, లీడ్ బ్యాంకు మేనేజర్, తిరుపతి జిల్లా

సైన్స్ పరీక్షకు 293 మంది గైర్హాజర్

తిరుపతి ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో గురువారం సైన్స్ పరీక్షకు 293మంది గైర్హాజరయ్యారు. జిల్లాలోని 152 పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష జరిగింది. మొత్తం 27, 517మంది హాజరుకావాల్సి ఉండగా, 293మంది గైర్హాజరయ్యారు. 27,224 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు డీఈఓ డాక్టర్ వి.శేఖర్ తెలిపారు.



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,760
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,606
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.77,800
రిటైల్ వెండి గ్రాము	రూ.79.80

ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటుకు తొలి అడుగు


మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి, వేదికపై వీసీ రాజారెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటుకు తొలి అడుగు పడిందని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి తెలిపారు. గురువారం ఎస్వీయూలో ప్రతిపాదిత తిరుపతి ఇన్నోవేషన్ హబ్ తొలి సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ మాట్లాడుతూ క్రీస్తు పూర్వం నుంచే ఆధ్యాత్మిక నగరమైన తిరుపతి విద్యా క్షేత్రంగా ప్రసిద్ధి గాంచినట్లు పలు గ్రంథాల్లో ఉన్నట్లు పేర్కొన్నారు. విశ్వ విద్యాలయాల ప్రతిష్టను పెంచుతూ విజ్ఞాన జ్యోతిని వెలిగించాలని, ఇందు కోసం సమష్టిగా కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా తిరుపతిలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ స్పాన్సర్‌తో పరిశ్రమలు, విద్యాసంస్థల సహకారంతో ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటుచేయాలని ప్రతిపాదించినట్లు తెలిపారు. తిరుపతి, పరిసర ప్రాంతాల్లోని వివిధ సంస్థలను కలుపుకుని ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటు చేయాలన్నదే ధ్యేయమని పేర్కొన్నారు. ప్రెసిషన్ ఇంజినీరింగ్, రోబోటిక్స్, సైబర్ సెక్యూరిటీ, క్వాంటం టెక్నాలజీస్, ఏఐ ఆధారిత సెన్సార్లు, ఆరోగ్య సంరక్షణ పరికరాలు, సోలార్ వాహనాలు, హైడ్రోజన్ ఉత్పత్తి, క్లీన్ ఎనర్జీ, మెటల్ ఫోమ్స్, హై ఎనర్జీ మెటల్స్, వేస్ట్ టు వెల్త్ తదతర ఎంపిక చేసిన రంగాల్లో పరిశోధన, ఆవిష్కరణలు, కార్బన్ క్యాప్చర్, సంకలిత తయారీతో పాటు యూజీ, పీజీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, పేటెంట్‌లను దాఖలు చేయడం, ప్రచురించడం, టెక్నాలజీ బదిలీ, స్టార్టప్‌లు, డెవలప్‌మెంట్ ప్రోటోటైప్ పరికరాల స్థాపనకు ఈ ఇన్నో వేషన్ హబ్ మద్దతిస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ కె.రాజారెడ్డి, ఎస్ఆర్ఎం వర్సిటీ వీసీ ప్రొఫెసర్ నారాయణరావుతో పాటు ఐఐటి తిరుపతి, ఐజర్, మహిళా వర్సిటీ, స్విమ్స్, ఎన్ఏఆర్ఎల్, గాదంకి, ఎస్వీయూ, అమరావతికి చెందిన వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

25న వాక్ ఇన్ సెలెక్షన్ మేళా

తిరుపతి తుడా: వివిధ ఉద్యోగ నియామకాలకు ఈనెల 25వ తేదీన వాక్ ఇన్ సెలక్షన్ మేళాను నిర్వహించనున్నట్లు శ్రీలక్ష్మి శ్రీనివాస మ్యాన్ పవర్ కార్పొరేషన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. టీటీడీ శ్రీపద్మావతి చిల్డ్రన్ హార్ట్ సెంటర్ హాస్పిటల్‌లో స్టాఫ్ నర్స్, అనెస్థీషియా టెక్నీషియన్, ఎంఎన్‌ఓ (హెల్పర్స్) పోస్టులు, బర్డ్ హాస్పిటల్‌లో ఆడియాలజిస్ట్, అనెస్థీషియా టెక్నీషియన్ పోస్టుల భర్తీకి వాక్ ఇన్ సెలెక్షన్ మేళా నిర్వహించనున్నట్లు వివరించింది. అభ్యర్థులు ఆరోజు మధ్యాహ్నం 12 గంటల లోపు దరఖాస్తు, ధృవీకరణ పత్రాలతో హాజరుకావాలని తెలిపింది. అర్హత, జీత భత్యాలు, ఇతర వివరాల కోసం కార్పొరేషన్ వెబ్ సైట్ http://slsmpc.inను సందర్శించవచ్చని కార్పొరేషన్ సీఈఓ శేష శైలేంద్ర తెలిపారు.

నాలుగేళ్లలో మేము గుర్తుకు రాలేదా..?


స్థానికుల ప్రశ్నలకు తలపట్టుకుంటున్న టీడీపీ నేత పులివర్తి నాని

తిరుపతి మంగళం : నాలుగేళ్లల్లో ఏ నాడు ప్రజల బాగోగులు గుర్తు రాలేదా? ఎన్నికల సమయం వచ్చినప్పుడు మాత్రమే మేము గుర్తుకు వస్తామా? అని టీడీపీ చంద్రగిరి ఇన్‌చార్జ్ పులివర్తి నానిని సప్తగిరికాలనీలోని ప్రజలు నిలదీశారు. గురువారం మంగళంలోని సప్తగిరినగర్ పంచాయతీలో 'మీ ఇంటికి మీ నాని' కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. 'తల్లీ ఏమైనా సమస్యలున్నాయా? ఈ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరవేర్చడం లేదు కదా? ఈ సారి ఒక్క అవకాశం ఇవ్వండి మీ భవిష్యత్తులే మార్చేస్తాం' అంటూ పులివర్తి ఇంటింటికీ వెళ్లి ప్రజలను అడిగారు. ప్రజలు వైఎస్సార్ సీపీ పాలనలో తామంతా బాగున్నామని సమాధానం ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సమస్యలు మా ఇంటి గేటు కూడ తాకడం లేదని, జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు మా జీవితాలకు భరోసాలయ్యాయని కాలనీకి చెందిన లక్ష్మి గర్వంగా చెప్పారు. గత ఎన్నికల్లో ఓట్లు కోసం వచ్చిన మీకు మా సమస్యలు, సంతోషాల గురించి ఎందుకులే అన్నా అంటూ ముఖం మీదే అడిగారు. కనీసం కరోనా సమయంలో మేము చచ్చామా..బతికామా అని చంద్రబాబు కానీ, మీరు కాని పట్టించుకున్నారా? అని సూటిగా ప్రశ్నించారు. ఇప్పుడు మళ్లీ ఎన్నికలు వస్తున్నాయి కాబట్టి ప్రజలు గుర్తు వచ్చారా..ప్రజాసమస్యలు గుర్తు వచ్చాయా? అని ప్రశ్నించారు.

అన్ని విధాలా ఆదుకున్న చెవిరెడ్డి

కరోనాతో ప్రపంచమే అతలాకుతలంగా మారిందని, అలాంటి సమయంలో మీకు తానున్నానంటూ కరోనా మహమ్మారి నుంచి చంద్రగిరి నియోజకవర్గంలోని ప్రజలను కాపాడేందుకు తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా నిత్యం ప్రజల్లోనే ఉంటూ కరోనా మందులతో పాటు మాస్కులు, శానిటైజర్స్, పండ్లు, సి విటమిన్ టాబ్లెట్లును అందించి మా ప్రాణాలు కాపాడిన దేవుడు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అని సప్తగిరికాలనీలోని లక్ష్మితో పాటు స్థానిక ప్రజలు పులివర్తికి స్పష్టం చేశారు. ఆనందయ్య మందును ఇంటింటికీ పంపించడంతో పాటు నిత్యావసర సరుకులు, ఇంటి ఖర్చులకు నగదును కూడా అందించిన మహానుభావుడు భాస్కరన్న అని చేతులెత్త దండం పెట్టి చెప్పారు. దీంతో చేసేది లేక టీడీపీ నాయకులు వెనుదిరిగారు.

సంతలో రైతులకు ఉచిత భోజనం


భాకరాపేట సంతలో భోజనం వడ్డిస్తున్న నాయకులు

భాకరాపేట : వారం వారం సంతలో రైతులకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సొంత నిధులతో ఉచిత భోజన వసతి కల్పించినట్లు ఎమ్మెల్యే సతీమణి లక్ష్మి తెలిపారు. గురువారం మధ్యాహ్నం స్థానిక సంతలో ఉచిత భోజనం కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరుగాలం శ్రమించి పండించిన ఉత్పత్తులను అమ్ముకునేందుకు వచ్చే రైతులు, కూరగాయలు విక్రయించే మహిళలు ఖాళీ కడుపుతో పోకూడదన్నదే ఎమ్మెల్యే సంకల్పమని తెలిపారు. సీడీసీఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డి, ఎంపీపీ యుగంధర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు స్వరూప, సర్పంచ్ భూపాల్, వైస్ ఎంపీపీ సునీత, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొండారెడ్డి, జెసీఎస్ కన్వీనర్ ఖదీర్‌అహ్మద్, డివిజన్ అధ్యక్షుడు గురుశంకర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

16న విశ్వంలో ఉచిత నమూనా పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం టాలెంట్ స్కూల్లో ఆదివారం ఉదయం 9 గంటలకు నమూనా పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షను ఉచితంగా నిర్వహించనున్నట్లు ఆ విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 10వ తేదీన రాష్ట్రస్థాయిలో నిర్వహించే పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు అనుగుణంగా ఈ నమూనా పరీక్షను నిర్వహిస్తామని, పరీక్ష అనంతరం పాలిటెక్నిక్ కోర్సులపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ ఉచిత నమూనా ప్రవేశ పరీక్షను సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

పేదల అభ్యున్నతే జగనన్న లక్ష్యం


హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు


చెవిరెడ్డి మోహిత్‌రెడ్డితో తల్లి లక్ష్మి

- వీఆర్ అగ్రహారం మహా పాదయాత్రలో చెవిరెడ్డి మోహిత్ రెడ్డి
- బతికినంత కాలం వైఎస్సార్‌సీపీకే ఓటు వేస్తామని ప్రజలు స్పష్టం

భాకరాపేట : నిరుపేదల కల సాకారం చేయడమే ధ్యేయంగా సీఎం జగనన్న పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ చంద్రగిరి నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఎర్రావారిపాళెం మండలం వీఆర్ అగ్రహారం పంచాయతీలో గడప గడపకు మహా పాదయాత్ర కార్యక్రమం సాగింది. ఇంటింటికీ వెళ్లి ఆయన ప్రజలతో మమేకమయ్యారు. పథకాలు అందుతున్నాయా.. మీకు ఏదైనా సమస్య ఉందా అంటూ 43 డిగ్రీల ఉష్ణోగ్రతలో కూడా ముందుకు సాగారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకుంటున్న ముఖ్యమంత్రి జగనన్న రుణం తీర్చుకోలేనిదన్నారు. కూడు, గూడు, గుడ్డకు దూరమైన నిరుపేదలు తమ ఏళ్ల నాటి కల సాకారం కావడం పట్ల ఆనందంగా ఉన్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో గృహ నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్నా.. తాము లబ్ధి పొందలేదని వీఆర్ అగ్రహారం పంచాయతీలో పలువురు నిరుపేదల వినతి మేరకు హౌసింగ్ అధికారులతో మాట్లాడి ఇళ్లు మంజూరు చేయాలని మోహిత్‌రెడ్డి సూచించారు. రూ.1.15 కోట్ల తుడా నిధులతో వీఆర్ అగ్రహారం పంచాయతీని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. సాయిబాలపల్లె, వీఆర్ అగ్రహారం, నాగలకుంట, అరవాండ్లపల్లె, నడింపల్లె గ్రామాల్లో ఆయన పర్యటించారు. ప్రతి చోటా జగనన్న పథకాలతో తమ జీవితాలు మారాయని, తాము జీవించి ఉన్నంత వరకు వైఎస్సార్ సీపీకే ఓటు వేస్తామని స్పష్టం చేశారు. అగ్రహారంలో 104 వైద్య శిబిరంలో బీపీని పరిశీలించుకున్నారు. సర్పంచ్ రమణారెడ్డి, ఉప సర్పంచ్ సుగుణ, ఎంపీపీ శివ లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కరుణాకర్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి చెంగల్‌రెడ్డి, కన్వీనర్ నాగార్జునరెడ్డి, పాదయాత్ర పరిశీలకులు చెవిరెడ్డి రఘునాథరెడ్డి, నిరంజన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, పార్టీ పంచాయతీ కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, చక్రధర్‌రెడ్డి, గణపతి, గిరి నాథరెడ్డి, రాజారెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

తల్లి లక్ష్మి పరామర్శ

ఈనెల 6వ తేదీ నుంచి ఎర్రావారిపాళెం మండలంలో గడప గడపకు మహా పాదయాత్రలో పాల్గొంటూ పల్లె నిద్ర చేస్తున్న మోహిత్‌రెడ్డిని తల్లి చెవిరెడ్డి లక్ష్మి పరామర్శించారు. నడింపల్లెలో ఉన్న తనయుడిని కలిశారు. ఆప్యాయంగా పలకరించి మండుటెండలో పర్యటించడం చూసి చలించిపోయారు. తల్లితో కలసి ఆయన భోజనం చేశారు.

త్వరలో వేద వర్సిటీ స్నాతకోత్సవం


సమావేశంలో మాట్లాడుతున్న జేఈఓ సదాభార్గవి

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలో టీటీడీ ఆధ్వర్యంలో ని శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయ ఏడవ స్నాతకోత్సవాన్ని త్వరలో నిర్వహించనున్నట్లు జేఈఓ సదా భార్గవి తెలిపారు. వర్సిటీలో గురువారం వీసీ ఆచార్య రాణి సదాశివ మూర్తి అధ్యక్షతన అకడమిక్ కౌన్సిల్ సమావేశం జరిగింది. జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ ఆచార్య జీఎస్ఆర్ కృష్ణమూర్తి, టీటీడీ డీఈఓ భాస్కర్ రెడ్డి, ప్రముఖ వేద పండితులు శలాక రఘునాథశర్మ, విష్ణుభట్ల లక్ష్మీనారాయణ ఘనాపాఠి, ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం ప్రిన్సిపల్ కుప్పా శివసుబ్రమణ్య అవధాని, ఉమాశంకర ఘనపాఠి, వర్సిటీ రిజిస్ట్రార్, డీన్లు, విభాగాధ్యక్షులు పాల్గొని పలు నిర్ణయాలు తీసుకున్నారు. నిర్ణయాలను జేఈఓ సదా భార్గవి వివరించారు.

- ఇద్దరు గొప్ప వేదపండితులకు మహా మహోపాధ్యాయ, ఇద్దరు పండితులకు వాచస్పతి బిరుదు ప్రదానం చేయడం
- గవర్నర్ కార్యాలయం ఆదేశం అనుసరించి నూతన విద్యా విధానం, సంప్రదాయ విధానానికి ఇబ్బంది లేకుండా అనుసంధానం చేయడం, టీటీడీ వేద పాఠశాలలను వేద విశ్వవిద్యాలయంలో అనుసంధాన ప్రక్రియను త్వరతిగతిగా పూర్తి చేసి వేద పాఠశాలన్నింటినీ ఒకే ఛత్రం కిందకు తీసుకురావడం.
- ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో కొత్త కోర్సులను ప్రవేశ పెట్టడం, ఆగమ, పౌరహిత్య విభాగాల్లో రెండేళ్ల కోర్సుగా ఆగమ అభిజ్ఞ, పౌరోహిత్య అభిజ్ఞ కోర్సులను ఇంటర్మీడియట్ స్థాయిలో ప్రవేశపెట్టడం.
- అతీంద్రియ విజ్ఞానం, జ్యోతిష్య, వా స్తు, ధర్మశాస్త్ర, పౌరాణిక, ట్రైనింగ్ ఐకేఎస్ తదితర కొత్త కోర్సులను ప్రవేశ పెట్టడం.
- ఢిల్లీ అక్షరధామ్ స్వామినారాయణ ట్రస్టు వారితో పరస్పర విజ్ఞాన వినిమయం చేసుకునేందుకు ఎంఓయూకు అనుమతి తీసుకోవడం.